# సాక్షి వనపర్తి

శనివారం : 15 : జూన్ : 2024






### శ్రీరంగనాథుడి వైభవం

శ్రీపురం శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



### 3 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

జూలై 3 నుంచి పాలమూరులో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.4 /24.2

### వాతావరణం

రోజులో ఎక్కువగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళలో మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రూ. 1.40 కోట్లతో అభివృద్ధి పనులు



**ఆత్మకూర్:** మున్సిపాలిటీలోని వార్డుల్లో రూ. 1.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుతం తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ, సీసీరోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం, కార్మికుల జీతభత్యాలు తదితర అభివృద్ధి పనులకు రూ. 1.40 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. వార్డుల్లో సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు ఉన్నారు. కాగా, ఆత్మకూర్ మున్సిపాలిటీగా ఏర్పడక ముందు మేజర్ గ్రామపంచాయతీలో చేపట్టిన వెంచర్లు, కేటాయించిన 10 శాతం స్థలాలు, అక్రమ నిర్మాణాల వివరాలు ఇవ్వాలని పాలక మండలి సభ్యులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని వెంచర్లలో 10 శాతం స్థలాలు అన్యాక్రాంతమయ్యాయని, అక్రమ నిర్మాణాలు జరిగినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు.

### రామన్‌పాడులో పెరిగిన నీటిమట్టం

**మదనాపురం:** రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం నాటికి 1,015 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేయగా.. సమాంతర కాల్వ ద్వారా 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

### జాతీయస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారులు



**వనపర్తి:** మహారాష్ట్రలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని జింఖాన గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–18 రగ్బీ పోటీల్లో వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లికి చెందిన క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచి, నేషనల్స్‌కు ఎంపికైనట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి మహ్మద్ హఫీజ్ తెలిపారు. జట్టులోని తొమ్మిది క్రీడాకారులు వనపర్తి జిల్లాకు చెందిన వారే ఉండటం సంతోషంగా ఉందన్నారు.

### డీఈఈ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** వివిధ డైట్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం ప్రభుత్వం నిర్వహించే డీఈఈ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

### ఎస్టీ గురుకులాల్లో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** గిరిజన సంక్షేమ గురుకులాల్లో డిగ్రీ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంగీత ప్రకటన లో తెలిపారు. ఈ నెల 17 నుంచి 23 వరకు జరిగే స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో రావాలన్నారు. మరింత సమాచారం కో సం 79010 97704ను సంప్రదించాలని కోరారు.

### జూలైలో నారు పోసుకోవాలి

**బిజినేపల్లి:** తెలంగాణ సోన అనే వరి రకాన్ని ఉమ్మడి పాలమూర్ జిల్లా రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయనుండటంతో రైతులు జూలై మొదటి వారంలో నారు పోసుకోవాలని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో వివరించారు. రైతులు తొందర పడి జూన్‌లో నారుమడి పోసుకుంటే పంటకాలం పెరగటమే కాకుండా, పంట ఏపుగా పెరిగి కింద పడిపోయే అవకాశం ఉందన్నారు. జూలై మొదటి వారంలో నారు పోసుకోవాలని, నత్రజని ఎరువులను మితంగా ఉపయోగించాలని సూచించారు.

# అటకెక్కిన విచారణ

## డీసీసీబీలో రుణాల పేరిట రూ.కోట్లు పక్కదారి



ఆత్మకూర్‌లోని సహకార బ్యాంకు

- తేలని నకిలీ పాస్‌పుస్తకాల వ్యవహారం
- 11 ఏళ్ల క్రితం కేసులు నమోదు
- సమగ్ర దర్యాప్తు కరువు
- పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు

**ఆత్మకూర్:** నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలతో రైతుల పేరిట రూ.కోట్ల రుణాలను కొల్లగొట్టారు. బడా నాయకులు, బ్యాంకు అధికారులతో కుమ్మక్కై అందినకాడికి దోచుకున్నారు. ఈ వ్యవహారంపై కేసులు నమోదై సంవత్సరాలు గడుస్తున్నా.. విచారణ మాత్రం ముందుకు సాగడం లేదు. కొందరు అక్రమార్కులు విచారణకు అడ్డుకట్ట వేయడంలో సఫలీకృతులయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నకిలీ పాస్‌పుస్తకాల వ్యవహారం పూర్తిగా మరుగున పడే దశకు చేరినా.. అటు డీసీసీబీ ఉన్నతస్థాయి అధికారులు, ఇటు పోలీసులు పట్టించుకోకుండా అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**2010లో భారీగా రుణాలు..**

ఆత్మకూర్ మండల కేంద్రంతో పాటు దేవరపల్లి, ఆరేపల్లి, వీరరాఘవపూర్, మేడేపల్లి, మోట్లంపల్లి, కొంకనివానిపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతుల పేరిట కొందరు పైరవీకారులు నకిలీ పాస్‌పుస్తకాలను సృష్టించడంతో పాటు టైటిల్ డీడ్‌ను సమకూర్చుకున్నారు. వీటి సహకారంతో 2010లో ఆత్మకూర్ డీసీసీబీలో పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలను రూ. కోట్లలో కాజేశారు. ఈ బాగోతంపై అప్పట్లో 'సాక్షి'లో ప్రత్యేక కథనం వెలువడటంతో డీసీసీబీ, పీఏసీఎస్ అధికారులు స్పందించారు. తమ బ్యాంకులో చోటుచేసుకుంటున్న అవినీతి చిట్టాను తేల్చే ప్రయత్నం చేశారు.

### పీఏసీఏస్‌లోనూ రూ. 6 కోట్ల రుణాలలో గోల్‌మాల్..



ఆత్మకూర్ పీఏసీఎస్ కార్యాలయం

ఆత్మకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలోనూ 2008–09, 2009–10 సంవత్సరాల్లో నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలతో రూ. 6 కోట్లకు పైగా రుణాలు కొల్లగొట్టారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 2014లో అప్పటి ప్రభుత్వం ప్రకటించిన పంట రుణమాఫీ పథకంలో అప్పన్నంగా కాజేసిన ఈ రుణాలు సైతం మాఫీ అవుతాయని అక్రమార్కులు భావించగా.. రుణమాఫీ కాలేదని తెలిసింది. ఈ నకిలీ వ్యవహారంపై సంబంధిత అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంతో రుణాల పక్కదారి విషయం మరుగున పడింది. కాగా, ప్రస్తుత పాలక మండలి సభ్యులు పాత రుణాలు వసూలు చేయలేక.. కొత్త రుణాలు ఇవ్వలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాల వ్యవహారాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇంకా వెలుగులోకి రాని ఫేక్ రుణాలు ఎన్నో ఉన్నాయన్న చర్చ సాగుతోంది.

### 2013లో నకిలీల గుర్తింపు..

ఆత్మకూర్ డీసీసీబీలో నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలతో రుణాలు పొందినట్లు 2013లో గుర్తించారు. వాటి పరిశీలన నిమిత్తం నారాయణపేట ఆర్డీఓ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఈవిషయమై అప్పటి తహసీల్దార్ రాజేందర్‌గౌడ్, డీసీసీబీ మేనేజర్ యూసూఫ్ ఆధ్వర్యంలో సమగ్ర విచారణ జరిపించి, 33 మంది నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలతో రుణాలు పొందినట్లు నిర్ధారించారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అప్పటి సీఐ గోవర్ధన్‌గిరి ఆధ్వర్యంలో 33 మందిపై కేసు నమోదుచేసి, విచారణ చేపట్టారు. కొంతకాలం తర్వాత సీఐ బదిలీపై వెళ్లడంతో విచారణ మరుగున పడింది.

### విచారణ జరిపిస్తామంటున్న అధికారులు..

నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాల వ్యవహారంపై 'సాక్షి' ఆరా తీయగా.. పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై డీసీసీబీ డీజీఎం లింబాద్రి, సీఈఓ లక్ష్మయ్యను సంప్రదించగా, గతంలో ఫేక్ పాస్‌పుస్తకాలు పెట్టి రుణాలు పొందిన 33 మందిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. పోలీసులను సంప్రదించి విచారణను వేగవంతం చేయించడంతో పాటు రుణాలను రికవరీ చేయిస్తామన్నారు. కాగా, తాను ఇటీవలే వచ్చానని.. ఈ కేసు విషయం తనకు తెలియదని.. బ్యాంక్ అధికారులెవరూ తనను సంప్రదించలేదని సీఐ శివకుమార్ అన్నారు.

## మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ పవార్

**వనపర్తి:** తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఈనెలాఖరులోగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ పవార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమం పరిశీలన కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు రానున్నట్లు వెల్లడించారు. గుడ్ గవర్నెన్స్ పారామీటర్స్ 7 రిజిస్టర్లు, జాబ్‌కార్డుల అప్‌గ్రేడ్, వర్క్ సైట్ బోర్డులన్నీ సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో 150కి తగ్గకుండా పాంపాండ్స్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పూర్తిచేసి, పనులు చేపట్టేందుకు అనుమతులు తీసుకోవాలన్నారు. ఫిష్ పాండ్స్‌కు సంబంధించి మండలానికి 10 చొప్పున నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలు కొలతల ప్రకారం పనులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ ఇంటింటి సర్వే విషయంలో నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. పనులు పక్కాగా, వేగంగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఓ నాగేంద్ర, జెడ్పీ సీఈఓ యాదయ్య, డీపీఓ రమణమూర్తి ఉన్నారు.

**ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి..**

జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరింలని కలెక్టర్ తేజస్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4,298 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని.. తహసీల్దార్లు తమ లాగిన్‌లో ఉన్న వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పరిశీలన పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, ఫిజికల్ ఫారాలు ఆర్డీఓకు పంపించాలని తెలిపారు. ప్రతి మండలంలో రోజు కనీసం 10 దరఖాస్తులను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపించాలన్నారు. సీఎం ఆఫీస్‌కు వచ్చే గ్రీవెన్స్ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్డీఓ లాగిన్ నుంచి రోజుకు వందకు తగ్గకుండా పరిష్కరించిన దరఖాస్తులను కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంపై నిర్లక్ష్యం చేస్తే, చర్యలు తప్పవని హెచ్చరించారు.

## చిన్నపొర్లలో ఉద్రిక్తత



చిన్నపొర్లలో అంబులెన్స్‌ను అడ్డుకుంటున్న సంజీవ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

- సంజీవ్ మృతదేహం స్వగ్రామానికి తరలింపు
- అంబులెన్స్‌ను అడ్డగించిన బంధువులు, గ్రామస్తులు
- నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ఊట్కూర్:** భూ తగాదాల నేపథ్యంలో ఓ యువకుడిని దారుణంగా కొట్టి హతమార్చిన ఘటనతో చిన్నపొర్లలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాయాదుల దాడిలో మృతిచెందిన సంజీవ్ మృతదేహానికి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి సాయంత్రం అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకురాగా.. అంబులెన్స్‌ను మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఊట్కూర్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇరువర్గాల మధ్య దాడి జరుగుతుండగా ఎస్ఐకి, డయల్ 100కి ఫోన్ చేసినా స్పందించలేదని ఆరోపించారు. పోలీసులు ప్రజల రక్షణ కోసం ఉన్నారా.. ప్రాణాలు తీసేందుకు ఉన్నారా అంటూ మృతుడు కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వారికి నచ్చజెప్పేందుకు సీఐ చంద్రశేఖర్ ప్రయత్నించినా శాంతించలేదు. రాత్రి 8 గంటలు గడిచినా అంబులెన్స్ ముందే బైఠాయించారు. పరస్పర దాడులు.. పోలీసుల పహారా.. నిరసనతో గ్రామంలో ఏ సమయంలో.. ఏం జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు.

## తాగునీటి ఫిల్టర్ బెడ్స్ వినియోగంలోకి తెస్తాం



పెబ్బేరులో తాగునీటి ఫిల్టర్ బెడ్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**పెబ్బేరు రూరల్:** పెబ్బేరు మున్సిపాలిటీలో కొన్ని రోజులుగా నిరుపయోగంగా ఉన్న తాగునీటి ఫిల్టర్ బెడ్స్‌ను త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ల మరమ్మతుకు అవసరమైన అంచనాలను తయారు చేసి, నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. అనంతరం తోమాలపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం పలు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచులు సురేందర్‌గౌడ్, వెంకటేష్ సాగర్, దయాకర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, శ్రీహరిరాజు, రామకృష్ణ, లక్ష్మణ్, రాములు యాదవ్, వీరస్వామి, యుగంధర్‌రెడ్డి, గుమ్మడం రాంరెడ్డి పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వలపై నజర్



ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం(ఫైల్)

### పౌరసరఫరాల శాఖ స్పెషల్ డ్రైవ్

- సుమారు 90 మిల్లుల్లో లోటుధాన్యం నిల్వలు
- సమీక్షలకే పరిమితమైన అధికారుల చర్యలు
- కలెక్టర్ హెచ్చరించినా.. మార్పు లేని మిల్లర్లు
- సీఎంఆర్ బియ్యం ఇవ్వని మిల్లర్లకు నోటీసులు

**వనపర్తి:** సీఎంఆర్ కోసం ఎలాంటి గ్యారంటీ లేకుండా మిల్లర్లకు ఇచ్చిన ధాన్యంపై పౌరసరఫరాల శాఖ అధికారులు దృష్టి సారించారు. ఇటీవల అధికారులు టాస్క్‌ఫోర్స్ బృందం సంయుక్తంగా నిర్వహించిన పరిశీలనలో జిల్లా ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చినట్లు జిల్లాలో చర్చ వినిపిస్తోంది. జిల్లా మొత్తం బాయిల్డ్, రా మిల్లులు 150కి పైగా ఉండగా.. అందులో సుమారు 90 మిల్లుల్లో 2022–23 వానాకాలం సీజన్‌లో సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యంలో కొద్దిమేరనే ఉండటం గమనార్హం. ఈ విషయంపై పరిశీలనకు వెళ్లిన అధకారులు సమగ్ర నివేదిక ఇటీవలే ఉన్నతాధికారులకు సమర్పించారు. వారం రోజుల కిందట ఈ విషయంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి ధాన్యం నిల్వలు లేని మిల్లర్లు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. ధాన్యం తీసుకొచ్చి నిల్వ చేయలేక, డబ్బులు కట్టలేక మిల్లర్లు మరికొంత సమయం తీసుకునేందుకు పాలకులు, రాజకీయ నాయకుల వద్దకు పరుగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం అడ్డగోలుగా ఎలాంటి జామీను పత్రాలు లేకుండా రూ.కోట్ల విలువ చేసే ధాన్యాన్ని కట్టబెట్టడాన్ని తప్పుపడుతూ.. ప్రస్తుత ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని పాత బకాయిల రికవరీపై దృష్టి సారించటంతో మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేవనే విషయం వెలుగులోకి వస్తోంది. ఇలా 2022–23 వానాకాలం నుంచి సీజన్ల వారీగా వరుసగా పెండింగ్ సీఎంఆర్‌ను పూర్తి చేయించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

### పెండింగ్‌లో 2,131 ఏసీకేల బియ్యం..

జిల్లా వ్యాప్తంగా 90 మిల్లుల నుంచి ఒక్క 2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించి 65904.719 ఏసీకేల బియ్యం రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 2131.990 ఏసీకేల బియ్యం పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక లెక్కలో ఉంది. రెండేళ్లుగా కనీసం ఒక్క ఏసీకే బియ్యం కూడా ఇవ్వని మిల్లు ఒక్కటి ఉండగా.. కేవలం ఒక్క ఏసీకే బియ్యం ఇచ్చిన మిల్లుల సంఖ్య పది ఉన్నాయి. ఈ మిల్లుల నుంచి బియ్యం రికవరీ చేసేందుకు పలు దఫాల్లో కలెక్టర్ తేజస్ పవార్ స్వయంగా మిల్లర్లు, అధికారులతో సమీక్షలు నిర్వహించి హెచ్చరించినా.. మార్పు లేకపోవటం గమనార్హం. చివరి అవకాశంగా జూన్ నెలాఖరు వరకు అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది.

**25 శాతం అదనంగా బియ్యం ఇవ్వాల్సిందే..**

2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యంను జూన్ 31వ తేదీ వరకు ఎఫ్‌సీఐకి అప్పగిస్తే.. సదరు మిల్లు పేరును డిఫాల్ట్ జాబితా నుంచి తొలగిస్తారు. రానున్న సీజన్‌లో సీఆర్ఎస్ కోసం ధాన్యం ఇస్తారు లేదంటే.. ఆర్ఆర్ యాక్ట్‌ను ఉపయోగించే నగదు వసూళ్లకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. డిఫాల్ట్ మిల్లర్స్ జాబితాలో ఉన్న వారికి ప్రస్తుత సీజన్‌లో సీఆర్ఎస్ ఆలాట్‌మెంట్లు చేయకపోవటం గమనార్హం. ఇన్‌టైంలో బియ్యం ఇచ్చిన మిల్లర్లకే గత యాసంగి సీజన్‌లో సీఎంఆర్ కేటాయింపులు చేశారు.

**25 మంది మిల్లర్లకు నోటీసులు..**

2020–21 వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యం ఇవ్వని మిల్లర్లు సుమారు 25 మందికి కలెక్టర్ ఆదేశాల మేరకు నగదు రికవరీ కోసం ఆర్ఆర్ యాక్ట్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

### నివేదిక ఉన్నతాధికారులకు అందజేశాం..



జిల్లాలో ధాన్యం నిల్వలు తక్కువగా ఉన్న మిల్లుల వివరాలతో సమగ్ర నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు అందజేశాం. వారి ఆదేశం మేరకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే.. 2020–21 రెండు సీజన్ల సీఎంఆర్ పెండింగ్ ఉన్న వారికి నోటీసులు జారీ చేశాం. 2022–23 వానాకాలం సీజన్ వారికి ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. అంతలోపు 25 శాతం అదనపు బియ్యంతో పెండింగ్ క్లియర్ చేసుకోవాల్సి ఉంది. లేదంటే చర్యలు తీసుకుంటాం. – బాలు, అసిస్టెంట్ డీఎం, పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్, వనపర్తి జిల్లా

# తెలంగాణపై కుట్రలు చేస్తే సహించం



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నిరంజన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**వనపర్తి:** ప్రత్యేక తెలంగాణ వ్యతిరేక శక్తులు ఎలాంటి కుట్రలకు పాల్పడినా సహించేది లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఇటీవల గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చి, తెలంగాణ ప్రాధాన్యతను తగ్గించేందుకు బీజేపీ, అనుబంధ పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు.. తెలంగాణ రాష్ట్రం నుంచి ఏడు మండలాలను లాక్కున్నా విషయాన్ని గుర్తుచేశారు. మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. నదీజలాల కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. అందుకు రేవంత్ సర్కారు సహకారం అందిస్తూ.. నీటిపారుదలశాఖ కార్యదర్శిగా తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యాదాస్‌ను నియమించడం అనుమానాలకు ఊతమిస్తోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలను చైతన్యం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా తన గెలుపునకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చేసిన కృషిని ఎప్పటికీ మరువలేనని అన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని.. ప్రజల అభిమానం గెలుచుకునే ప్రయత్నం దిశగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రమేష్‌గౌడ్, అభిలాష్‌రావు, నాగం తిరుపతిరెడ్డి, గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, మాణిక్యం, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## మీసేవ కేంద్రాల తనిఖీ

**గోపాల్‌పేట:** మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాల్లో శుక్రవారం జిల్లా అధికారి చంద్రకాంత్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓ మీసేవ కేంద్రాన్ని మరో స్థలంలోకి మార్చినట్టు గుర్తించి, ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థలం మార్చాలంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని.. అనుమతి వచ్చిన తర్వాతే మార్చాలని తెలిపారు. ఈవిషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అదే విధంగా ఓ ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకుడు తీసుకొచ్చే దరఖాస్తులను మరో మీసేవ కేంద్రంలో చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల నుంచి నిర్ణీత ధరలు మాత్రమే తీసుకోవాలని తెలిపారు.

## క్లుప్తంగా

### నీటి సంపులో పడి మహిళ మృతి

**కోడేరు:** నీటిసంపులో పడి మహిళ మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఉప్పరి కలమ్మ (40) అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈమెకు ఇద్దరు కూతుర్లు విజయలక్ష్మి,లావణ్య ఉన్నారు. వీరికి వివాహాలు చేయడంతో ఇంటి దగ్గర ఒంటరిగానే ఉండేది. అనారోగ్యంతో ఉండడంతో తీగలపల్లి చెందిన చిన్న అల్లుడు మధు ఆమెను గురువారం ఆస్పత్రి చూయించి కోడేరులో తన ఇంటి దగ్గర వదిలేసి వెళ్లాడు. తిరిగి శుక్రవారం ఉదయం రావడంతో ఇంట్లో ఆమె కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారిని అడిగినా ఫలితం లేకపోవడంతో ఇంటి వద్ద ఉన్న సంపులోకి చూడగా శవమై కనిపంచింది. గతంలోనే భర్త బాలకిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందాడు.

### అనుమానాస్పదంగా చెంచు యువకుడి మృతి

**మన్ననూర్:** నల్లమల అటవీ లోతట్టు ప్రాంతంలోని చెంచు పెంటకు చెందిన యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. చిగుర్ల రాములు(18) నాలుగు రోజులు కిందట రాంపూర్ పెంటకు (గ్రామానికి) కొంత దూరంలో ఓ చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందడంతో పెంట వాసులు అక్కడే అంత్యక్రియలు చేశారు. శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు యువకుడి మృతిచెందిన సంఘటనను చర్చించుకోవడంతో వెలుగులోకి వచ్చింది. ఇది ఇలా ఉండగా.. మృతుడు చిగుర్ల రాములు అచ్చంపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన వివాహిత ఉపాధ్యాయురాలితో కొంత కాలంగా మాట్లాడుతుండేవాడు. అది కాస్త ప్రేమగా మారడంతో ఇద్దరు కలిసి తిరుగుతుండేవారు. విషయం ఆమె భర్తకు తెలిసి రాములును హెచ్చరించాడు. ఈ క్రమంలో ఆందోళనకు గురైన రాములు రాంపూర్‌కు వెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమీప బంధువుల ద్వారా తెలిసింది.

### కూతురి మరణాన్ని తట్టుకోలేక తల్లి..

**జడ్చర్ల టౌన్:** మండలంలోని ఆలూరుకు చెందిన అరుణ (30) శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ రమేష్‌బాబు వివరాల మేరకు.. భూత్పూర్ మండలం తాటిపర్తికి చెందిన అరుణకు, ఆలూరుకు చెందిన మైబుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు సంతానం కాగా.. గతేడాది చిన్నకూతురు అనారోగ్యంతో చనిపోయింది. ఓవైపు కూతురి మరణం.. మరోవైపు మగపిల్లలు కలగక పోవడంతో మనస్తాపానికి గురైన ఆమె.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

**గద్వాల క్రైం:** ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గద్వాల మండలం సంగాలలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పర్వతాలు వివరాల మేరకు.. సంగాలకు చెందిన రాజు (27) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మరోవైపు ఎలాంటి ఉపాధి లేకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందిన అతడు.. గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో మూడు గేదెలు మృతి

**మక్తల్:** మండలంలోని భూత్పూర్‌లో శుక్రవారం మూడు గేదెలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెన్నయ్యగౌడ్ రైతుకు చెందిన మూడు గేదెలను గురువారం రాత్రి ఎప్పటిలాగానే కట్టేసి ఇంట్లోకి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారేసరికి మూడు గేదెలు మృతిచెందాయి. ఈ విషయమై మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. గేదెలకు కొందరు వ్యక్తులు తవుడులో విషం పెట్టి కావాలని చంపారని ఆరోపించారు. ఈ సంఘటనపై పశుసంవర్ధక వైద్యులు అశోక్ గ్రామానికి చేరుకొని మూడు గేదెలకు పోస్టుమార్టం చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మిరెడ్డి తెలియజేశారు.

### వాహనం ఢీకొని జింక మృతి



**మదనాపురం:** మండల పరిధిలోని గోవిందహళ్లీ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. పొలాల్లో నుంచి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రోడ్డు దాటుతుండగా.. వాహనం ఢీకొట్టింది. బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే జింక మృతిచెందింది. ఈ విషయం గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకొని జింకను తీసుకెళ్లారు.

# శ్రీరంగనాథుడి వైభవం



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

- భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీపురం రంగనాథస్వామి
- నేటినుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

**నాగర్‌కర్నూల్:** జిల్లాలోని పురాతన వైష్ణవాలయాల్లో ఒకటిగా ఉన్న శ్రీపురం శ్రీరంగనాథ స్వామి ఆలయం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. సాక్ష్యాత్తు విష్ణుమూర్తి అవతారమైన శ్రీరంగనాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి అత్యంత చెరువలో వెలసిన శ్రీపురం రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలకు జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.

**ఆలయానికి వందల ఎకరాలు..**

కాలక్రమేణా రంగనాథస్వామి మహిమలకు భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతూ వచ్చింది. దీంతో సమీపంలోని సంస్థానాధీశులు కూడా శ్రీపురం రంగనాథస్వామికి భక్తులుగా మారడంతో పాటు ఆలయ నిర్వహణ కోసం వందలాది ఎకరాల స్థలాన్ని ఇనామ్‌గా ఇచ్చారని ఆధారాలు ఉన్నాయి. ఆత్మకూరు ప్రాంతంతో పాటు గద్వాల, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లోని అనేక గ్రామాల్లో రంగనాథ స్వామి ఆలయానికి భూములు ఉండేవని.. కాలక్రమంలో చాలా భూములు అన్యాక్రాంతం అయినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ చుట్టుపక్కల సుమారు 120 ఎకరాల దాకా భూములు ఉన్నాయి. రంగనాథస్వామి ఆలయం



రంగనాయకస్వామి మూలవిరాట్

**కార్యక్రమాలు ఇలా..**

- 15న శ్రీరంగనాథ స్వామికి అభిషేకం, తిరుమంజనం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, అంకురార్పణ.
- 16న అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణం, గరుడ యుద్ధభేరీ పూజ, దేవతాహ్వానం తదితర పూజా కార్యక్రమాలు.
- 17న ఉదయం 11 గంటలకు గోదా సమేత రంగనాథ స్వామి తిరుకల్యాణం, సాయంత్రం 7:30 నుంచి రథోత్సవం నిర్వహించనున్నారు.
- 18న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, దేవతోద్వాసన, ద్వాదశరాధన, ధ్వజ అవరోహణ, కుంభ ప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి.

450 ఏళ్లపాటు ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏకంగా అగ్రహారం వెలిసినట్లు ఆధారాలు ఉన్నాయి. సుమారు 100కు పైగా బ్రాహ్మణ కుటుంబాలు శ్రీపురంలో ఉండేవని.. మారిన కాలంతో పాటు వారిలో ఎక్కువ భాగం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని స్థానికులు తెలిపారు.

**కోరిన కోర్కెలు తీరుతాయి..**

శ్రీపురంలో కొలువైన రంగనాథుడు అత్యంత మహిమగల దేవుడు. సాక్ష్యాత్తు విష్ణుమూర్తి అవతారమైన శ్రీపురం శ్రీ రంగనాథ స్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయి. ముఖ్యంగా బ్రహ్మోత్సవ వేళ స్వామిని దర్శించుకుంటే మరింత శుభం కలుగుతుంది. రంగనాథుడి చల్లని చూపుతో సమీప ప్రాంతాలన్నీ సుభిక్షంగా మారాయి. 30 ఏళ్లపాటు ఆలయంలో సరైన నిర్వహణ లేకపోవడంతో సమీప ప్రాంతాల్లో కరువు నెలకొందని గ్రామస్తులు అంటారు. ఆలయాన్ని 2014లో పునరుద్ధరించుకున్న తర్వాత కరువు మాటే లేకుండా పోయిందని భక్తుల విశ్వాసం.

– తిరుమల వింజమూరి రంగాచార్యులు

**శిథిలావస్థ నుంచి వైభవం దిశగా..**

ఘనమైన చరిత్ర కలిగిన శ్రీరంగనాథ స్వామి ఆలయం కాలక్రమేణా శిథిలావస్థకు చేరింది. ఆలయ నిర్వహణ కోసం కేటాయించిన భూములపై కౌలు సక్రమంగా రాకపోవడంతో దూప దీపాలకు కూడా నోచుకోని పరిస్థితి ఏర్పడింది. 2012లో కొందరు భక్తులు, ఆలయ ధర్మకర్తల కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా చొరవ తీసుకొని శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని పునర్నిర్మించాలని సంకల్పించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో రూ.కోటి వ్యయంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పురాతన శైలి దెబ్బతినకుండా ఆలయాన్ని పునరుద్ధరించారు. దీంతోపాటు ఆలయం చుట్టూ భారీ ప్రాకారం, కోనేరు, 25 అడుగుల ఎత్తయిన రథం సమకూర్చుకున్నారు. 2014 జూన్‌లో ఆలయం పునఃప్రతిష్ఠ చేసుకున్నారు. అప్పటి నుంచి నిత్య పూజలతో పాటు అనేక ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఆలయంలో వైకుంఠ ఏకాదశితో పాటు ధనుర్మాస ఉత్సవాలు, గోదా కల్యాణం, విజయ దశమి, సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. అదేవిధంగా జేష్ఠ్య మాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఒకప్పుడు కూలిన గోడలు, విరిగిన విగ్రహాలు, పిచ్చి మొక్కలతో నిర్మానుష్యంగా కనిపించే ఆలయ ప్రాంగణం .. ప్రస్తుతం అద్భుతమైన ఆలయంగా మారి అత్యంత శోభాయమానంగా వెలుగొందుతోంది.

# వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి



నారాయణపేటలోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదురుగా ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

- మూడు రోజులుగా కడుపులోనే మృత శిశవులు
- ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన

**నారాయణపేట రూరల్:** ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో మూడు రోజులపాటు మృతి చెందిన కవలపిల్లలను కడుపులో మోస్తూ చివరికి తన ప్రాణాలను సైతం కోల్పోయిన ఘటన చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రానికి చెందిన కారు మెకానిక్ అంజద్, సమీనాబేగం(28)కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. రెండు సిజరిన్ కాన్పుల్లో ఒక కుమారుడు, కుమార్తె జన్మించారు. అయితే మూడోసారి గర్భం దాల్చి 8వ నెల కొనసాగుతుంది. ఈ క్రమంలో రెగ్యులర్‌గా చెకప్ కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వస్తుండేది. ఈ నెల 11న మంగళవారం నెలవారి చెకప్‌కు వచ్చి తిరిగి సొంత గ్రామానికి వెళ్తున్న క్రమంలో బైక్‌పై నుంచి కిందపడింది. కడుపుపై గాయం కావడంతో తిరిగి ఆస్పత్రికి వచ్చి చూయించుకుంది. పరీక్షించిన వైద్యులు కడుపులోని పిండానికి ఎలాంటి నష్టం కాలేదని చెప్పారు. ఇంటికి వెళ్లిన తర్వాత కడుపులో కదలికలు లేవని సమీనా తన కుటుంబ సభ్యులకు చెప్పడంతో బుధవారం ఉదయం మళ్లీ ఆస్పత్రికి వచ్చారు. పరీక్షించిన వైద్యులు కడుపులో బిడ్డ క్షేమంగా ఉందని చెప్పారు. సమీనా తనకు ఆయాసం అవుతుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు వెళ్లి వైద్యులను గట్టిగా ప్రశ్నించగా పరీక్షించి కడుపులో బిడ్డలు చనిపోయారని, గర్భిణి పరిస్థితి బాగాలేదని, ప్లేట్‌లెట్స్ పూర్తిగా పడిపోతున్నాయని చెప్పి మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేశారు. అయితే కుటుంబ సభ్యులు హైదరాబాద్ జజ్జిఖానా ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ డాక్టర్లు పరిశీలించి ఆమె పరిస్థితి విషమంగా ఉందని, బతకడం కష్టమని చెప్పారు. తమ బాధ్యత కాదని కుటుంబ సభ్యులతో హామీ పత్రం తీసుకుని ఆపరేషన్ చేసి మృతశిశువులను బయటకు తీయగా, మూడు రోజుల క్రితమే గర్భంలో శిశువులు చనిపోయినట్లు ధ్రువీకరించారు. అటు వెంటనే గర్భిణి సైతం తనువు చాలించింది. నారాయణపేటలో వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి యాజమాన్యం రాత్రి వరకు మృతురాలి కుటుంబ సభ్యులతో చర్చలు జరుపుతూ ఉన్నారు.

### కళాశాల నిర్మాణంలో భూమి పోతుందని..

# పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం



మున్నూరు శేఖర్‌రెడ్డి (ఫైల్)

**నర్వ:** మండల కేంద్రానికి చెందిన మున్నూరు శేఖర్ రెడ్డి (39) గురువారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ కురుమయ్య వివరాల మేరకు.. శేఖర్‌రెడ్డికి నర్వ శివారులోని 41 సర్వే నంబర్‌లో 6 గుంటల భూమి ఉంది. అతడి భూమి పక్కనే జూనియర్ కళాశాల నిర్మాణం కోసం ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్థల పరిశీలన చేశారు. అయితే జూనియర్ కళాశాల భవన నిర్మాణంలో తన భూమిని కోల్పోతానేమోనన్న అభద్రతా భావానికి గురైన శేఖర్‌రెడ్డి.. తన పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య నాగేంద్రమ్మ, కుమారులు భరత్, మహేష్ ఉన్నారు. కాగా, శేఖర్‌రెడ్డి ఆత్మహత్యపై సోషల్ మీడియాలో అనేక వదంతులు చక్కర్లు కొట్టడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా శుక్రవారం పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

- మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మృతుడి కుటుంబ సభ్యులను ఎంపీ డీకే అరుణ పరామర్శించారు. ముందుగా శేఖర్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని.. శేఖర్‌రెడ్డి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# జూరాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల ద్వారా నీటి పంపింగ్

**ధరూరు:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు 6,558 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 354, ఆవిరి రూపంలో 128, భీమా లిఫ్టు-1కు 230 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 1,280 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 7.224 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# గుండేడులో గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఏఈఎస్ నర్సింహారెడ్డి, పట్టుబడిన గంజాయి, నిందితురాలు

**జడ్చర్ల:** గుట్టుగా సాగుతున్న గంజాయి వ్యాపారంపై ఎక్సైజ్ అధికారులు నిఘా వేసి పట్టుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఏఈఎస్ నర్సింహారెడ్డి వివరాలు వెల్లడించారు. బాలానగర్ మండలంలోని గుండేడులో సబావత్ లక్ష్మి ఇంటిని తనిఖీ చేశారు. ప్యాక్ చేసిన 2.1 కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.లక్ష ఉంటుందని, హైదరాబాద్ నుంచి ఇక్కడకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. రాజాపూర్ మండలం సింగమ్మగూడ తండాకు చెందిన లక్ష్మి 8నెలలుగా గుండేడులో ఇల్లు కొనుగోలు చేసి అక్కడే ఉంటున్నట్లు తెలిపారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి వివిధ పరిశ్రమలలో పనులు చేస్తున్న వారికి విక్రయిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ విప్లవరెడ్డి, ఎస్ఐ నాగరాజు, హెచ్‌సీలు పాల్గొన్నారు.

# అందరూ సుఖశాంతులతో ఉండాలి

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

**జోగుళాంబ శక్తిపీఠం:** ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. అలంపూర్ జోగుళాంబబాలబ్రహ్మేశ్వర ఆలయాలను శుక్రవారం ఎంపీ దర్శించుకున్నారు. ఈఓ పురేందర్‌కుమార్, ముఖ్య అర్చకుడు ఆనంద్‌శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీగా గెలుపొందిన తర్వాత ఆమె మొదటి సారి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లా ప్రజలంత సుఖ సంతోషలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గతంలో అమ్మవారి దర్శనం చేసుకుని తనను గెలిపించాలని, నరేంద్ర మోదీ మరలా ప్రధానమంత్రి కావాలని కోరుకున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో తన గళం వినిపించేందుకు అమ్మవారు అవకాశం కల్పించారని చెప్పారు. ఇక్కడికి వస్తున్న భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా వసుతులు కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు.



జోగుళాంబ దేవికి కుంకుమార్చన చేస్తున్న ఎంపీ డీకే అరుణ

**బీచుపల్లి ఆలయాల సందర్శన**

**ఎర్రవల్లిచౌరస్తా:** ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని శుక్రవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ సందర్శించారు. తమ ఇంటి ఇలవేల్పు అయిన అభయాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ రామన్‌గౌడ్ శేష వస్త్రాలతో ఎంపీని సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## జూలై 3 నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



పోటీల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

**మహబూబ్‌నగర్ క్రీడలు:** రాష్ట్రంలో క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో వచ్చేనెల 3 నుంచి 6వ తేదీ వరకు రాష్ట్రస్థాయి అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ పోటీల బ్రోచర్లను శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాను క్రీడల్లో ఉన్నతస్థానంలో నిలపాలన్నారు. క్రీడలకు అన్ని విధాలుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో జరిగే ఈ టోర్నమెంట్‌లో క్రీడాకారులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, కోశాధికారి ఎల్.రాజశేఖర్, విజయ్‌రెడ్డి, శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, కిశోర్, సతీష్ జోసెఫ్, భానుప్రకాశ్, అనిల్, వెంకటప్ప పాల్గొన్నారు.

## పశువులు తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

**అలంపూర్:** అక్రమంగా పశువులను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఉండవెల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సయ్యద్ అక్బర్, మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ అక్యూం ఏలూరులోని నూజివీడు నుంచి హైదరబాద్‌కు 63 కోడెలను కంటైనర్‌లో తరలిస్తున్నారు. అలంపూర్ చౌరస్తాలోని పుల్లూరు టోల్‌ప్లాజా, చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేయగా.. కంటైనర్‌లో కోడెలను తరలిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా కబేళాలకు కోడెలను తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. 63 కోడెలలో ఒకటి మృతిచెందగా 62 కోడెలను మహబూబ్‌నగర్‌లోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. కోడెల విలువు రూ.6 లక్షల వరకు ఉంటుందని అంచనాగా తెలియజేశారు.



కోడె దూడలను తరలించిన కంటైనర్

**తనిఖీల్లో గేదెలు పట్టివేత**

సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో గేదెలు పట్టుబడినట్లు ఉండవెల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్న 11 గేదెలను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. వీటిలో ఓ గేదె మృతిచెందింది. మిగిలిన పది గేదెలను ఎర్రవల్లి చౌరస్తా సమీపంలోని గోశాలకు తరలించినట్లు తెలిపారు. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని చిలకుర్తికి చెందిన మహమ్మద్ జాంహగీర్, ఇదే జిల్లాలోని పెద్దఊర మండలం మల్లెవారికుంట తండాకు చెందిన రమావత్ శ్రీకాంత్ ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు, గిద్దలూరు సంతల నుంచి కొనుగోళ్లు చేసి ఆటోలో తరలిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

### అత్యాచారం కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష

**మహబూబ్‌నగర్ క్రైం:** దళిత యువతిని అత్యాచారం చేసిన కేసులో ఓ వ్యక్తికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2016 ఫిబ్రవరి 4న జిల్లా కేంద్రంలోని బోయపల్లికి చెందిన ఆర్ఎంపీ మల్లిఖార్జున్ వద్దకు అదే గ్రామానికి చెందిన ఓ దళిత యువతి కడుపు నొప్పి బాధతో వైద్యం నిమిత్తం వెళ్లింది. ఈ క్రమంలో ఆ యువతిపై మల్లిఖార్జున్ క్లినిక్‌లో అత్యాచారం చేశాడు. జరిగిన అఘాయిత్యాన్ని యువతి తల్లిదండ్రులకు చెప్పింది. తండ్రి మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేయడంతో పాటు చార్జిషీట్ నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు శుక్రవారం జిల్లా ప్రత్యేక న్యాయస్థానం పరిశీలనకు రావడంతో ఈ కేసులో మొత్తం 13 మంది సాక్షులను ప్రవేశపెట్టగా.. వాదప్రతివాదనలు పూర్తయిన తర్వాత నేరం రుజువైంది. దళిత యువతి కావడంతో ప్రత్యేక సెక్షన్ల కింద న్యాయమూర్తి వి.శారద దేవి నేరస్తుడు మల్లిఖార్జున్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.8 వేల జరిమానా, పదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ.. తీర్పు వెల్లడించారు.

### తృటిలో తప్పిన పెను ప్రమాదం



**ఎర్రవల్లిచౌరస్తా:** ఎన్‌హెచ్-44పై భారీ కంటెయినర్ అదుపుతప్పి మరో రోడ్డుపైకి దూసుకెళ్లిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ఆక్సిస్ కంపెనీకి చెందిన భారీ కంటెయినర్ ఎర్రవల్లి మండలంలోని పొగాకు కంపెనీ వద్దకు రాగానే ఒక్కసారిగా అదుపుతప్పి, డివైడర్ మీదుగా అవతలి రోడ్డుపైకి దూసుకెళ్లింది. అటుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా, కర్నూల్ నుంచి ఎర్రవల్లి వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రమాదాన్ని తృటిలో తప్పించుకున్నాడు. కంటెయినర్ నుంచి ఇంజన్ భాగం పూర్తిగా విడిపోయి రోడ్డుపై నిలవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ వెంకటేష్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో కంటెయినర్‌ను పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

## గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

**గండేడ్/మహమ్మదాబాద్:** గడ్డి మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గండేడ్ మండల పరిధిలోని వెన్నాచేడ్‌కి చెందిన వెంకటయ్య, ఎల్లమ్మల మొదటి కుమారుడు రాజు(30) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకునేవాడు. ఎప్పటిలాగే శుక్రవారం లింగాయిపల్లి సమీపంలో పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం దాదాపు ఐదున్నర గంటల ప్రాంతంలో గడ్డి మందు తాగాడు. విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పైలట్ అక్బర్, ఈఎంటీ లక్ష్మీనారాయణ అతడికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కారణాలు తెలియాల్సి ఉంది.

### సారా తయారీ స్థావరంపై దాడి



**చారకొండ:** మండల కేంద్రంలోని ఓ వ్యవసాయ పొలంలో సారా తయారీ చేస్తున్న స్థావరంపై ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి, జిల్లా టాస్క్‌ఫోర్సు టీం శుక్రవారం దాడి చేశారు. 600 లీటర్ల బెల్లం పానకం, 4 కేజీల పటిక, 10 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సారా తయారీ, క్రయ విక్రయాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### ఇసుక నిల్వలు సీజ్



**కొత్తకోట రూరల్:** అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఆర్ఐ పర్వతాలు, హెడ్ కానిస్టేబుల్ కుర్మయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాం వెనుక ఇసుకను నిల్వ చేశారనే సమాచారం అందింది. అక్కడికి వెళ్లి పరిశీలించగా పట్టణానికి చెందిన పెద్దన్నగారి కృష్ణారెడ్డి, రమేష్ ఇసుకను నిల్వ చేసినట్లు నిర్ధారణ అయ్యింది. ఇసుక 15 ట్రాక్టర్ల వరకు ఉండవచ్చని ఆర్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి హెచ్చరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma,D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *అడ్మిషన్లు పరిమితం. ఫోన్: 8688977112,338

OLD AGE HOME
■ ఒమేగా హోమ్‌కేర్ వంట / ఇంటిపని చేయుటకు, వృద్ధులను, పేషెంట్లను, చిన్న పిల్లలను 24 గంటలు చూసుకొనుటకు మీ ఇంటికి కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్: 8977639664 / 8977639665

సాక్షి ద్వారా మీ ఆత్మీయులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పూర్తిగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించవలసిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్